## మనసొంపుగా



# తెలదూర్చినందుకు.....

అదృష్టం అంటే నీదేనే! అంది కోమలి.

"నేనూ అదే అనుకుంటూ వుంటా" ఒప్పేసుకుంది భారతి.

"చూశావా...చూశావా ఎంత కరెక్ట్‌గా చెప్పానో" ఉత్సాహంగా అంది కోమలి.

'నువ్వెప్పుడూ అంతేనే...అదెంటో గాని " మళ్లీ ఒప్పేసుకుంది భారతి.

"అది నా గొప్పతనం కాదే... కేవలం ...కేవలం నీ గొప్పతనం...మరీ చెప్పాలంటే.. నీ అదృష్టం అంతే".

ఔనౌను..అది నిజం..సత్యం..వాస్తవం"

"చూశావా నా గొప్పతనం నీక్కూడా తెలిసిపోయింది..ఒక మనిషి తన గొప్పతనాన్ని గుర్తించిననాడు మరింత గొప్పవాడవుతాడని...ఆయనెవరో చెప్పారు. గుర్తుందా?"

"గుర్తు లేకేం. అందుకే ఆయన మరింత గొప్ప వాడయ్యాడు...అదెంటోనే... నా కన్నీ అలాగే తెలిసిపోతుంటాయి. బహుశా నా గొప్పతనమేమో"

"గొప్పతనమేమో అని మామూలుగా అంటావే... మహా గొప్పతనం. ఆయనెవరో మహా గొప్పవాడ యితే...నువ్వు మహా గొప్పదానివి."

"ఎస్...ఎస్..నువ్వు చెబుతుంటే నాకిప్పుడు అనిపిస్తోంది నేను మహాగొప్పదాన్ని...ఎస్"

"ఆ గొప్పతనం నీకెలా వచ్చిందో తెలుసా?"

"నేను తెలీదన్నా నువ్వు ఒప్పుకోవు. అయినా వాస్తవం మాట్లాడాలి కదా! నేను మహాగొప్పదాన్ని కాబట్టి సర్వం నాకు అవగతమే" నాటకంలో డైలాగులా అంది భారతి.

"నీకు తెలుసన్న విషయం నాకు తెలుసు...అయిన నీ నోట చెప్పిద్దామనుకున్నాను...కాని నువ్వు మహా గొప్పదానివి కాబట్టి నీ చేత చెప్పించడం బాగోదు. కాబట్టి నేనే చెబుతున్నా" అని కంఠం సవరించుకుంది కోమలి.

"చెప్పు..చెప్పు..నువ్వు చెప్తే వినాలని, విని సంతోషించాలని, ఆనందించాలని, సంతసించాలని నాకు కదుంగదు తొందరగా ఉన్నది చెప్పుము చెప్పుము" అని రెండు చేతులు కట్టుకుని కోమలికి ఎదురుగా నిలబడింది భారతి.

"ఏమిటి ఫోజు! నువ్విలా...సారీ ...మీరలా చేతులు కట్టుకోరాదు. రాజీవి ఉట్టిపడేలా నడ్డి మీద ఓ చేయి మొకాలి మీద ఓ చేయి వేసి నిలబడాలి. మీ కన్నీ తెలుసు. కాని నా చేత చెప్పిస్తుంటారు. అదే మీ గొప్పతనం."

"హా..హా..హా ఓనౌను. కాని అదేదో సినిమాలో ఎన్టీఆర్ ఇలాగే నిలబడ్డాడు. ఐనా రాజీవి 'ఉట్టి' పడింది. అందుకే నేనిలా నిలబడ్డాను. ఇది నా మరో గొప్పతనం" అని జబ్బ చరుచుకుని మళ్లీ చేతులు కట్టుకుంది భారతి.

"అదేమరి! ఇలా చేస్తే నాకు ఒళ్లు మండుతుంది. ఏదో పోనీలే అని పొగుడుతుంటే, అన్నిటికీ ఎస్ ఎస్ అంటూ గంగిరెద్దులా తలూపకుండా ఎదురు సమాధానం చెప్తావా?" అకస్మాత్తుగా హుంకరించింది కోమలి.

"బోడి...నీవు చెప్పిందానికల్లా తానాతందాన అంటూ బుర్ర ఆడించడానికి నేనేమైనా చవట ననుకున్నావా?" దబాయిస్తున్నట్టు అంది భారతి.

"ఔనూ.. చవట అనేపదం స్త్రీ లింగమా? లేక పుంలింగమా?" అనుమానంగా అడిగింది కోమలి.

"నాకు తెలీదు.బహుశా లింగభేదం లేనిదను కుంటా"

"అది కూడ నీకు తెలీదు. నీ ఖర్మ. అది పురుషలింగం...ఆడవాళ్లని చవట అనరు.' దద్దమ్మ' అంటారు." సరిదిద్దుతున్నట్టు భారతి తల నిము రుతూ అంది కోమలి.

"దద్దమ్మ అన్నది గతకాలంలో నీ నామధేయమే కదూ" అడిగింది భారతి.

"పిచ్చిదానా...అది ఒకరి సొత్తుకాదు. వేరెవరి సొంతమూ కాదు. లక్ష్మీదేవిలా అదికూడా చంచ లమైనది. ఎవ్వడో చాలా కాలం క్రితం దద్దమ్మ అనేది నా పేరు కావచ్చు. కాని అది నన్ను వదిలేసి కూడా చాలా కాలామైంది. ఐనా నాకో డౌటు. చాలా కాలంగా వదలకుండా నన్ను పీడిస్తోంది" అని బుర్ర గోక్కుంది కోమలి.

"అదే దద్దమ్మ డౌటంటే...సరే అదేదో నాకు చెప్త క్లారిఫై చేస్తా" అని ధైర్యం చెబుతున్నట్టు కోమలి భుజంపై చేయి వేసింది భారతి.

"అది...అది...నిన్ను అడిగితే బాగుండదేమో"నసి గింది కోమలి.

"ఫరవాలేదు. అడుగు. నేనున్నాగా...ధైర్యంగా అడుగు" ధైర్యం చెప్పింది భారతి.

"వద్దులే...మరేదైనా అడుగుతా" అని తలవిది ల్చింది కోమలి.

"డామిట్...పిచ్చి పిచ్చిగా వుందా? అడగమంటే ననుగుతావే? అడుగు" అని కోమలి నెత్తిమీద గట్టిగా మొట్టికాయ లేపింది భారతి.

"సరే తప్పేటుందా! శతకోటి దేవతలారా నాకు మనోధైర్యాన్ని ప్రసాదించండి.." అని 'తలపైకెత్తి దణ్ణం పెట్టింది కోమలి.

"ఓహో...అయితే నన్ను అడిగేది మహాద్భుతమైన విషయమన్నమాట. త్వరగా...త్వరగా అడిగేసి నీ డౌట్‌ని తుడిచేసుకో" అని తొందరపెట్టింది భారతి.

"అతి చంచలమైన ఆ 'దద్దమ్మ' అనే పేరు చాలా కాలంగా నీతోనే ఎలా కాపురం చేస్తోంది? అనేది నా డౌటు" కాస్త భయం భయంగానే అడిగింది కోమలి.

"ఔరా ఎంత మాటన్నావ్...నిన్నిక బ్రతకనివ్వను. చంపేస్తా..కొరికేస్తా..నమిలేస్తా..మింగేస్తా.." అంటూ కోమలిపై లంఘించింది భారతి.

"అమ్మో..చచ్చిపోతున్నా..నాయనా...బాబో...కుయ్యో మొర్రో..." అని గగ్గోలు పెట్టింది కోమలి.

వీళ్లిద్దరినీ జాగ్రత్తగా గమనిస్తున్న నేను లేచి వాళ్లిద్దరినీ విడదీశాను.

"ఔన్రా! ఇందాకటి నుంచి చూస్తున్నాను, అసలు సబ్జక్ట్ లేకుండా మీరిద్దరు ఏదేదో మాట్లాడుతు న్నారు. మీ ఇద్దరికీ పిచ్చి పట్టిందా?" అని అడిగాను.

"ఒకరకంగా చెప్పాలంటే పిచ్చిపట్టినట్లే" అంది కోమిలి.

"ఔను పిచ్చిపట్టింది. ప్రొద్దుటి నుంచి ఏ పనీ లేక బోర్ కొట్టి కొట్టి..పిచ్చెక్కింది. అందుకే టైంపాస్ కోసం ఇలా ఊకదంపుడు డిస్కషన్ ప్రారంభించాం" అని అసలు విషయం చెప్పింది భారతి.

"మా టెక్నిక్ బాగుందా? టి.విలో అదేదో ప్రోగ్రాం..ఏంటది.. ఆ వన్‌మినిట్ ప్రోగ్రాం చూశాం. అనర్గళంగా ఏదొక కాన్సెప్ట్ మీద ఓ నిమిషం మాట్లాడాలన్నమాట. దాన్ని చూసి ఇన్‌స్పయి రయ్యాం. అసలు సబ్జెక్టే లేకుండా గంటలతరబడి డిస్కస్ చేయడం ఎలా? అనే విషయం మీద అప్పట్నుంచీ మేము రీసెర్చ్ మొదలు పెట్టాం. వీలు దొరికినప్పుడల్లా, బోరుకొట్టినప్పుడల్లా ఇలా డిస్కషన్ స్టార్ట్ చేస్తాం. విచిత్రం ఏంటో తెలుసా? మా డిస్కషన్ గంటలతరబడి అలా నిరంతర ప్రవాహంలా కొనసాగిపోతూనే వుంటుంది. ఏదో ఇవాళ తొందరపడి డిస్కషన్ చేస్తే డిష్యుం డిష్యుం అయ్యింది కాని మామూలుగా అయితే మాత్రం డిస్కషన్ ప్రవాహానికి అంతుండదు తెలుసా?" అని సుదీర్ఘమైన వివరణ ఇచ్చింది కోమలి.

కోమలి వివరణతో నా బుర్ర తిరిగిపోయింది. "ఇలా మీ డిస్కషన్ వినే మూడవ వ్యక్తి వెర్రెత్తి పోయి జుట్టు పీక్కోవాల్సిందే."అన్నాన్నేను.

"చూశావా ఇంతసేపు మా డిస్కషన్ విన్నా నువ్వింకా మాములుగానే విన్నావు. జుట్టింకా పీక్కో లేదు. పో.. నువ్వుకూడా మహా గొప్పదానివే నన్నమాట" అంది కోమలి.

"వద్దు తల్లీ వద్దు. మీ పాండిత్యాన్ని నా మీద ప్రయోగించవద్దు. కావాలంటే మీ కాళ్లు పట్టుకుంటాను." అన్నాను ప్రాధేయపడుతూ.

"ఇలా కాళ్ల బేరానికి దిగితే లాభంలేదు మిస్. మరేదైనా చేయాలి" అంది భారతి.

"ఏం చేయమంటారో చెప్పండి. మీ బాధ భరించేకంటే బురద గుంటలో పొల్లాడడం ఎంతో హాయిగా ఉంటుంది" అన్నాను.

"వద్దులే...అంత సాహసం చేయొద్దు. తర్వాత నిన్ను భరించడం కష్టం. ఒక పనిచేయి ముగ్గురం కలసి సినిమా కెళ్దాం. ఖర్చులన్నీ నువ్వే భరించాలి." అంది కోమలి.

"అమ్మో బడ్జెట్ పర్మిట్ చేయదు. మరోమాట చెప్ప" అన్నాను బ్రతిమాలాడుతూ.

"కుదరదు సినిమాయే కావాలి. మా డిస్కష న్‌లో తలదూర్చి, దాన్ని డైవర్ట్ చేసినందుకు నీకు పనిష్మెంట్ తప్పదు." అంది భారతి.

"సరే.సరే.బుద్ధి తక్కువై మీ ఇద్దరి మధ్య తలదూర్చాను. తప్పతుందా" అన్నాను నిస్పృహగా.

"ఓ పని చేస్తే తప్పతుంది" అంది కోమలి.

"ఏమిటది?" ఆశగా చూశాను కోమలి వంక.

"చాలా సింపుల్...మళ్లీ మా డిస్కషన్‌లో నువ్వు కూడ పార్టిసిపేట్ చేయడమే" అంది కోమలి.

"అమ్మో వద్దు. అర్జంట్‌గా సినిమాకి పదండి". అని తొందరచేశాను. ముగ్గురం కలసి నవ్వు కుంటూ సినిమాకి బయలు దేరాం.

—'మోతీలాస్య'




